క్లుప్తంగా

పొంచి ఉన్న ప్రమాదం



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని గట్టు మైసమ్మ తండా ప్రాథమిక పాఠశాల పక్కన ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో తండావాసులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో విద్యుత్ షాక్ వచ్చే ప్రమాదం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ట్రాన్స్‌కో అధికారులు ఇప్పటికైనా స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌ను మరో చోటికి మార్చాలని కోరుతున్నారు.

ముదిరాజ్‌లను బీసీ 'ఏ'లో చేర్చాలి



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ముదిరాజ్ కులస్తులను బీసీ డీ నుంచి బీసీ ఏ గ్రూపులోకి మార్చాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షులు విఠల్ అన్నారు. ఆదివారం ఎల్లారెడ్డిలో ముదిరాజ్ సంఘం వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మెన్ కుడుముల సత్యనారాయణ, రాములు, సంతోష్, నారాయణ, భూమయ్య, పోచయ్య తదితరులున్నారు.

మరుగుదొడ్లు ప్రారంభం



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ పరిధిలోని దేవునిపల్లి దేవి విహార్ ఫేజ్–2లో దేవీ వినాయక మండపం వద్ద కాసర్ల రాజయ్య జ్ఞాపకార్థం రూ.రెండు లక్షల 6వేల వ్యయంతో ఆయన కొడుకు కాసర్ల స్వామి నిర్మించిన మరుగుదొడ్లను ఆదివారం 12వ వార్డు కౌన్సిలర్ కాసర్ల గోదావరి ప్రారంభించారు.బీఆర్ఎస్ నాయకుడు కాసర్ల స్వామి స్వచ్ఛందంగా తన తండ్రి జ్ఞాపకార్థం మరుగుదొడ్లు నిర్మించడంతో దేవీ విహార్ ఫేజ్–2 కాలనీవాసులు ఎ. మనోహర్‌రావు తదితరులు అభినందించారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పొల్కంపేట గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేడికుంద లక్ష్మి(45) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతురాలు గతంలో పొల్కంపేట సర్పంచ్‌గా పని చేశారు. ఆమె మృతి పట్ల గ్రామ పెద్దలు ఆయా పార్టీ నాయకులు సంతాపం ప్రకటించారు. ఆమెకు ఇద్దరు కొడుకులున్నారు.

యథేచ్ఛగా మొరం రవాణా



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో మొరం రవాణా మూడు పూవులు, ఆరు కా యల చందంగా కొనసాగుతున్నదని పట్టణవాసులు అంటున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు గుట్టలను తవ్వి రాత్రి సమయాల్లో లేదా సెలవు దినాలలో మొరం రవాణా చేస్తున్న అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అక్రమంగా మొరం రవాణా జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

లయన్స్ క్లబ్ అధ్యక్షుడికి సన్మానం



బాన్సువాడ : లయన్స్ క్లబ్ ఆఫ్ బీర్కూర్ అధ్యక్షుడిగా ఎన్నికైన మేకల గాలప్పను ఆదివారం మున్నూరుకాపు సంఘం యువకులు ఘనంగా సన్మానించారు. మున్నూరు కాపు కులానికి చెందిన గాలప్ప లయన్స్ క్లబ్‌లో ఉన్నత పదవులను చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు యువకులు గంగాధర్, ధర్మతేజ, మేకల రాజు తదితరులున్నారు.

వైభవంగా బోనాలు



మాల్తుమ్మెదలో బోనాలతో శోభాయాత్ర నిర్వహిస్తున్న మహిళలు

ఆషాఢ మాసం ఆదివారం సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలు తీశారు. ఇంటింటికీ ఒకరు చొప్పున బోనం తీసి భక్తిశ్రద్ధలతో దేవతలకు పూజలు చేశారు. మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అక్కడే వనభోజనాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



ప్రజాభవన్‌లో బోనాల పండుగలో డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కతో ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



దన్నూర్‌లో..



పట్టణంలోని దేవి విహార్‌లో..



హైదరాబాద్‌లోని బోనాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు సతీమణి తోట అర్చన



దుర్కిలో..



దోమకొండలో..



తాడ్వాయిలోని చిన్నదేమి శివారులో..



ఎల్లారెడ్డిలో..

కేజ్‌వీల్ ట్రాక్టర్లతో రోడ్లు ధ్వంసం



కొత్తబాది–బుడిమి రోడ్డుపై కేజ్‌వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్

బాన్సువాడ రూరల్: మండలంలో వరినాట్ల సీజన్ కొనసాగుతుండటంతో ట్రాక్టర్ యజమానులు కేజ్ వీల్ ట్రాక్టర్లను బీటీ, సీసీ రోడ్లపై యథేచ్ఛగా తిప్పుతున్నారు. దీంతో రూ. లక్షల్లో ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రోడ్లన్ని ధ్వంసం అవుతున్నాయి. కేజ్‌వీల్స్‌కు నిబంధన ప్రకారం పట్టీలు వేయల్సి ఉన్నా యజమానులు పట్టించుకోవడం లేదు. దీంతో మండలంలోని ఆయా గ్రామాల్లో బీటీరోడ్లు పాడవుతున్నాయి. అధికారులు తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తుండంతో కేజ్‌వీల్ ట్రాక్టర్లను రోడ్లపై ఇష్టంవచ్చినట్లు తిప్పుతున్నారు. రెవెన్యూ, ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నిబంధనలు ఉల్లంఘించిన వారికి భారీ జరిమానాలు విధించాలని, ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు



విద్యార్థినులకు నోట్‌బుక్స్ అందిస్తున్న ప్రతినిధులు

దోమకొండ : మండల కేంద్రంలో ఆదివారం వాసవి క్లబ్ ఆధ్వర్యంలో డాన్ టు డస్క్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక బాలికల ఎస్సీ హాస్టల్‌లో విద్యార్థినులకు ప్యాడ్‌లు, పెన్నులు, నోటుబుక్కులు, బిస్కట్ ప్యాకెట్లను అందజేసినట్లు వాసవి క్లబ్ మండల అధ్యక్షుడు చింతల రాజేశ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి లింగ శ్రీకాంత్, కోశాధికారి రేఖ నవీన్ తదితరులున్నారు.

శాకంబరి మాత అలంకరణలో అమ్మవారు



నిజాంసాగర్(జుక్కల్): ఆషాఢ మాసం రెండో ఆదివారం సందర్భంగా మండల కేంద్రంలోని పోచమ్మ దేవత శాకంబరి మాత భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితుడు సంజీవ్‌రావ్‌శర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని స్థానిక మహిళలు శాకంబరి మాతగా అలకరించారు.

రైతులపై కేసులను ఎత్తివేయాలి



మాచారెడ్డి : మండలంలోని నడిమి తండా గిరిజన రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్,కొత్త నర్సింలు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఇటీవల అటవీ శాఖ అధికారులు కేసులు పెట్టిన రైతులను పరామర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు మాన్‌సింగ్, పెంట్య, దశరథ్, నరహరి, బాలు, నరేష్, సురేష్, రవి తదితరులున్నారు.

వసతి గృహాల్లో సమస్యలు పరిష్కరించాలి



హాస్టళ్లను సందర్శించిన ఏఐఎస్ఎఫ్ నాయకులు

కామారెడ్డి క్రైం : సమస్యలకు నిలయంగా సంక్షేమ వసతి గృహాలు మారాయని, సంక్షేమ హాస్టల్లో సమస్యలతో విద్యార్థులు రోజులు గడుపుతున్నారని ఏఐఎస్ఎఫ్ నాయకులు పేర్కొన్నారు. వారి ఆధ్వర్యంలో కామారెడ్డి గడిరోడ్ బీసీ హాస్టల్ నిజం సాగర్ చౌరస్తా ఎస్సీ హాస్టల్ ఆనంద నిలయం ఎస్టీ హాస్టల్‌ను ఆదివారం సంఘం ప్రతినిధులు సందర్శించి మాట్లాడారు. సంఘం మాజీ జిల్లా అధ్యక్షులు ఎల్ దశరథ్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ హాస్టళ్లలో అన్నంలో పురుగులు, రాళ్లు, చాలీచాలని అన్నం వడ్డిస్తూ విద్యార్థుల కడుపులు మాడుస్తున్నారన్నారు. ఎస్సీ ఆనంద నిలయంలో రూములు సరిపోక విద్యార్థులు బయట వరండాల్లో నిద్రిస్తున్నారని, బెడ్‌షీట్స్ ఎక్కడా ఇవ్వలేదన్నారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ పి శివప్రసాద్ ఎల్ సంపత్ పి జస్వంత్ ఆర్య మనోజ్ సిద్ధార్థ జగదీష్ విష్ణు నర్సింలు జగన్ రాకేష్ శ్రవణ్ సతీశ్ ఉన్నారు.

చెక్కుల పంపిణీ



బాన్సువాడ : సీఎంఆర్ఎఫ్ పథకం ద్వారా మంజురైన చెక్కులను ఆదివారం బాన్సువాడలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అందజేశారు. నియోజకవర్గంలోని 109 మంది లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన సభను సక్సెస్ చేయాలి



మాట్లాడుతున్న కాసుల రోహిత్

బాన్సువాడ : బాన్సువాడలో సోమవారం నిర్వహించే కాంగ్రెస్ ఆత్మీయ సమ్మేళన సభను సక్సెస్ చేయాలని కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం నాయకులు కాసుల రోహిత్ అన్నారు. ఆదివారం నియోజకవర్గంలోని బాన్సువాడ, బీర్కూర్, కోటగిరి, వర్నీ, మోస్రా, రుద్రూర్, పొతంగల్ మండలాల్లో ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలను, నాయకులను కలిసి ఆత్మీయ సమ్మేళనంకు భారీ ఎత్తున తరలి రావాలని సూచించారు. బాన్సువాడ ఎస్ఎంబీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన సభ జరుగుతుందన్నారు.

ఆర్యవైశ్య విద్యార్థులకు అభినందన



కామారెడ్డి అర్బన్ : ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (అవోపా) కామారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన పదవతరగతి, ఇంటర్మీడియట్ ఆర్యవైశ్య విద్యార్థులు 19 మందిని వెండి పతకాలు, ప్రశంసాపత్రాలతో అభినందించారు. అవోపా సభ్యుడు కొమ్మ జ్ఞానేశ్వర్ తన తండ్రి మల్లయ్య జ్ఞాపకార్థం వెండి పతకాలు అందించారు. స్థానిక రోటరీ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అవోపా అధ్యక్షుడు టి.కృష్ణమూర్తి, ప్రధాన కార్యదర్శి తృప్తి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి బెజుగం గంగాప్రసాద్, ప్రతినిధులు శ్రీధర్, సత్యసేన ఉన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మాచారెడ్డి : మండల కేంద్రానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు గట్టుకింది శ్రీహరి, పొదర్ల వెంకటరాములుకు హెచ్ఎంలుగా పదోన్నతి పొందారు. ఈ మేరకు ఆదివారం నేస్తం అసోషియేష ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా నేస్తం అధ్యక్షుడు షాబొద్దీన్ మాట్లాడారు. కార్యక్రమంలో నేస్తం సభ్యులు బాల్ కిషన్, మహిపాల్, రాంరెడ్డి, అంజయ్య, డీ.రాజు, బీ.రాజు, నారాయణ ఉన్నారు.

ఆర్యవైశ్య సంఘం కార్యవర్గం



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం గంజువర్తక సంఘం రాంమందిర్‌రోడ్డు ఆర్యవైశ్య సంఘం ఎన్నికలు ఆదివారం నిర్వహించగా అధ్యక్షుడిగా యెల్లంకి సుదర్శన్ గుప్తా, కార్యదర్శిగా బొమ్మ సుధీర్ కుమార్, ఉపాధ్యక్షుడుగా బెజగామ ప్రకాష్, సహాయకార్యదర్శిగా పడకంటి ప్రశాంత్, కోశాధికారిగా దుద్దెల్లి రాజశేఖర్, ఎన్నికయ్యారు.

బ్రాహ్మణ సంఘం జిల్లా సభ్యులకు సన్మానం



బాన్సువాడ : బ్రాహ్మణ సంఘం జిల్లా కార్యవర్గంలో బాన్సువాడకు చోటు లభించడం హర్షనీయమని బాన్సువాడ బ్రహ్మణ సంఘం అధ్యక్షులు చంద్రకాంత్‌రావు అన్నారు. ఆదివారం బాన్సువాడలో జిల్లా సభ్యులకు ఘనంగా సన్మానించారు. జిల్లా ఉపాధ్యక్షులుగా ప్రదీప్, జిల్లా సంయుక్త కార్యదర్శిగా వెంకటరమణరావు, సలహాదారులుగా కాశీనాథ్‌ను జిల్లా కమిటీలో చోటు కల్పించడంతో వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బాన్సువాడ బ్రహ్మణ సంఘం ప్రతినిధులు ఉమాకాంత్‌రావు, శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

గుడికి స్థలం విరాళం



మాచారెడ్డి : గజ్యానాయక్ చౌరస్తాలో పెద్దమ్మ గుడి నిర్మాణం కోసం మండల కేంద్రానికి చెందిన రావుల ప్రభాకర్ రెండు గుంటల స్థలాన్ని విరాళంగా ఇచ్చారు. ఈ మేరకు ఆదివారం ముదిరాజ్ సంఘం సభ్యులు స్థల దాతకు సన్మానం చేశారు.

బ్రాహ్మణ సంఘం..



సదాశివనగర్(ఎల్లారెడ్డి) : మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద ఆదివారం జిల్లా బ్రాహ్మణ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస శర్మ, ప్రధాన కార్యదర్శిగా బొందుగుల పాటి సతీశ్ కుమార్, ఉపాధ్యక్షులుగా పురుషోత్తం శర్మ, రాజేశ్వర్ శర్మ, ప్రహ్లాద రావు, మహిళ ఉపాధ్యక్షురాలిగా ఎస్.సునీత, కోశాధికారిగా నవీన్‌శర్మ, సహాయకార్యదర్శిగా ఉదయ భాను, వెంకటేశ్వర్ రావు, వెంకట రమణా రావు తదితరులున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా బగళాముఖి అమ్మవారి జన్మదినం

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డిలో బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను ఆదివారం ఘణంగా నిర్వహించారు. వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అష్టమి తిథిని పురస్కరించుకుని అమ్మవారికి జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ పంచామృత, హరిద్రా అభిషేకం, పుష్పాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో భక్తులు సతీష్, రేవంతప్ప, విఠల్, వెంకన్న, బాలకిషన్, శైలేందర్ తదితరులున్నారు.

ఆలయానికి భక్తుల విరాళం



కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి తూర్పు హౌసింగ్ బోర్డుకాలనీలోని శ్రీశారదా ఆదిశంకర ఆలయ సుందరీకరణ, అభివృద్ధి కోసం భూదానం కింద ఆదివారం పలువురు భక్తులు రూ.11వేల చొప్పున విరాళం అందజేశారు. భూదానం కోసం విరాళం అందజేసిన వారిలో ఆకుల గౌరీశంకర్–నాగలక్ష్మి, కస్వ వెంకటేశం–లలిత తదితరులున్నారు.

సీతారామాంజనేయ ఆలయ కమిటీ కార్యవర్గం

కామారెడ్డి అర్బన్ : కామారెడ్డి పట్టణం వివేకానంద కాలనీలోని సీతా రామాంజనేయస్వామి దేవాలయ కమిటీ ఎన్నికలు ఆదివారం నిర్వహించగా అధ్యక్షుడుగా కొండా అశోక్‌గుప్తా, కార్యదర్శిగా నాగెల్లి శ్రీనివాస్, కోశాధికారిగా శ్రీనివాస్ ఎన్నికయ్యారు.

శబరి మాత ఆశ్రమంలో భజనలు



తాడ్వాయి(ఎల్లారెడ్డి) : మండల కేంద్రంలోని శబరి మాత ఆశ్రమంలో శనివారం రాత్రి భక్తులు భగవన్నామ సంకీర్తనలతో భక్తి శ్రద్ధలతో ప్రత్యేక భజనలు చేశారు. అలాగే ఆలయం ప్రాంగణంలోని వెంకటేశ్వర, దత్తాత్రేయ, మార్కండేయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

మంత్రి పదవి రావాలని పూజలు

రాజంపేట : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు మంత్రి పదవి దక్కాలని కోరుకుంటూ ఆదివారం రాజంపేట మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ సుభాష్ నాయక్ ఆధ్వర్యంలో బడాపహాడ్‌లో ప్రత్యేక పూజలు చేపట్టారు. మాజీ సర్పంచ్ రమేష్, సర్దార్ నాయక్, మహదేవ్ పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల సందడి

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : మండలంలోని మైలారం గ్రామంలో గల కొచ్చెరి మైసమ్మ ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయ కమిటి సభ్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశాడ మాసం సందర్భంగా అమ్మవారికి భక్తుల రద్దీ పెరిగిందని రెండు వారాల ముందే గదులు నిండి పోయాయని ఆలయ కమిటి సభ్యులు గద్దం సాయిలు అన్నారు. వర్షాకాలం సందర్భంగా భక్తులు చెట్ల క్రింద ఇబ్బందులకు గురి కావాల్సి వస్తుందని ముందుగానే గదులు బుక్ చేసుకోవాలని తెలిపారు.

వర్షాల కోసం పూజలు



కామారెడ్డి అర్బన్ : వర్షాల కోసం లింగాపూర్ గ్రామస్తులు వినూత్నంగా గ్రామ దేవతలకు పూజలు చేశారు. కామారెడ్డి పట్టణ పరిధిలోని లింగాపూర్‌లో ఆదివారం గ్రామాభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో డప్పు వాయిద్యాలు, గుర్రంతో గ్రామ దేవతల ఆలయాల వద్దకు ఊరేగింపు వెళ్లారు. వానలు కురిసి పంటలు పండాలని వారు ఆకాంక్షించారు. 11వ వార్డు కౌన్సిలర్ కాసర్ల శ్రీనివాస్, వీడీసీ అధ్యక్షుడు ఎండీ షానూర్, ప్రతినిధులు మంచాల రమేష్, వడ్ల రవి, సుకుదేవ్ తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి గుట్ట వద్ద పూజలు

సదాశివనగర్(ఎల్లారెడ్డి) : వర్షాల కోసం మాజీ జెడ్పీటీసీ పడిగెల రాజేశ్వర్ రావు లింబాద్రి గుట్ట వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని వేడుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలభైరవ స్వామి మాజీ చైర్మన్ సతీశ్ గుప్తా, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లింబాద్రి నాయక్, యూత్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కిరణ్‌కుమార్ రెడ్డిలు పాల్గొన్నారు.

సంక్షిప్తం

మంత్రి పదవి రావాలని పూజలు

తాడ్వాయి(ఎల్లారెడ్డి) : ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌కు మంత్రి పదవి రావాలని కోరుతూ ఆదివారం తాడ్వాయి మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు పూజలు చేశారు. ఈ సందర్భంగా లింగంపేట మండలంలోని అల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, నాయకులు మహేందర్‌రెడ్డి తదితరులున్నారు.

నేడు బైక్ ర్యాలీ

నిజాంసాగర్(జుక్కల్) : మండలంలోని అచ్చంపేట నీటిపారుదల అతిథి గృహానికి విచ్చేస్తున్న రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌కు కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలుకుతున్నట్లు కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ అస్పత్‌వార్ వినోద్ తెలిపారు. అచ్చంపేట అతిథి గృహం నుంచి బాన్సువాడ వరకు బైక్ ర్యాలీ ఉంటుందన్నారు.

విద్యార్థినికి పరామర్శ

భిక్కనూరు : మండల కేంద్రం సమీపంలో ఉన్న సాంఘిక సంక్షేమ గురుకుల విద్యార్థి అక్షిత్‌కు విషపురుగు కాటేసిన విషయాన్ని తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శులు లక్ష్మణ్ మాదిగ, శంకర్ ఆదివారం పరామర్శించారు. కామారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న అక్షిత్ వద్దకు వీరు వెళ్లి పరామర్శించారు. వీరి వెంట ఎమ్మార్పీఎస్ నేతలు రమేష్, బాల్‌రాజు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

దోమకొండ : మండలంలోని గొట్టిముక్కుల గ్రామ శివారులో ఆదివారం బీటీ రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. దోమకొండ మండల కేంద్రం నుంచి గొట్టిముక్కుల, లక్ష్మీదేవునిపల్లి గ్రామాలకు రూ.2కోట్లతో ఈ పనులను ప్రారంభించినట్లు ఆర్అండ్‌బీ డీఈ శ్రీనివాస్ తెలిపారు. మండల కేంద్రం నుంచి లక్ష్మీదేవునిపల్లికి సుమారు 6 కి.మీ దూరం వరకు 2 ఫీట్లతో రోడ్డు పనులు ప్రారంభించినట్లు ఆయన వివరించారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా తిర్మలేష్

భిక్కనూరు : బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా అత్తెల్లి తిర్మలేష్‌ను ఆదివారం నియమించారు.ఈ మేరకు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార నియమాకం పత్రంను అందజేశారు. ఈ సందర్భంగా తిర్మలేష్ మాట్లాడుతూ మండలంలో పార్టీ అభివృద్ధికి పాటుపడుతానన్నారు.

డీటీని అరెస్ట్ చేయాలి

కామారెడ్డి అర్బన్ : తహసీల్ కార్యాలయంలో పనిచేసే జూనియర్ అసిస్టెంట్ తెద్దు ప్రశాంత్ ఆత్మహత్యకు కారణమైన తాడ్వాయి డిప్యూటీ తహసీల్‌దార్ వెంకటేష్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని ఎస్సీఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొంగల వెంకట్ డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడారు. సంఘం ప్రతినిధులు సంఘయ్య, రాజన్న, వంశీ తదితరులున్నారు.

సంఘమేశ్వర్‌లో వనభోజనాలు



దోమకొండ : మండలంలోని సంఘమేశ్వర్ గ్రామంలో ఆదివారం వనభోజనాలు చేశారు. ఆషాఢమాసం సందర్భంగా గ్రామస్తులంతా ఊరి చివర ఉన్న చెట్ల కిందకు వెళ్లి వనభోజనాలు చేశారు. ప్రతి ఆషాఢమాసం మొదటి ఆదివారం గ్రామంలో వనభోజనాలు ఉంటాయని గ్రామస్తులు తెలిపారు.